ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.4 । కనిష్ఠం 22.6
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 16 మార్చి 2024

ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు

కామారెడ్డి టౌన్, మార్చి 15: బీబీపేట మండలంలోని మందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎలాంటి అనుమతి లేకుండా విద్యార్థులతో వీడియో షూటింగ్‌కు అనుమతి ఇచ్చిన ప్రధానోపాధ్యాయుడికి శుక్రవారం డీఈవో రాజు షోకాజ్ నోటీసులు అందించారు. ఈనెల 1, 15న ప్రైవేట్ వ్యక్తులకు వీడియో షూటింగ్‌కు అనుమతి ఇవ్వడం, పాఠశాల విద్యార్థులను భాగసామ్యం చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివరణ ఇవ్వాలని సూచించారు.

ధరణి సమస్యలకు మోక్షం



- జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌లో 1,389 సమస్యలకు పరిష్కారం
- కొనసాగుతున్న ధరణి దరఖాస్తుల పరిశీలన
- జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 4,911 దరఖాస్తులు
- ఇందులో 40 శాతం మేర దరఖాస్తులు పరిష్కరించిన అధికారులు
- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

కామారెడ్డి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ధరణి దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు పెట్టుకున్న దరఖాస్తులను రెవెన్యూ అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఆయా దరఖాస్తులకు సంబంధించిన భూమి రికార్డులను పరిశీలిస్తూనే ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉందనే దానిపై క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేసుకుని సమస్యలను పరిష్కరిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ధరణికి సంబంధించి 4,911 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు 1,389 దరఖాస్తులు పరిష్కరించినట్లు పేర్కొంటున్నారు. కొన్ని తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తులను పరిష్కరించామని ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాల్సినవి ఉన్నాయని వాటి పనిలో నిమగ్నమయ్యామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

40 శాతం మేర దరఖాస్తుల పరిష్కారం

జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల్లో కొన్నింటికి పరిష్కారం లభిస్తోంది. ఈనెల 1వ తేదీ నుంచి ధరణి సమస్యలపై రెవెన్యూ శాఖ స్పెషల్ డ్రైవ్ చేపడుతోంది. ఇందులో జిల్లాలో ఇప్పటి వరకు 40 శాతం మేర ధరణి సమస్యలను పరిష్కరించినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 4,911 ధరణి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణకు 2,457 దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో 308 దరఖాస్తులను పరిష్కరించారు. మిగితా 2,149 పెండింగ్‌లో ఉన్నాయి. గ్రివెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ సంబంధించి 1,020 దరఖాస్తులు ఉండగా ఇందులో 582 పరిష్కరించగా 438 పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత భూములకు పట్టాపుస్తకాల జారీ కోసం 601 దరఖాస్తులు రాగా ఇందులో 18 పరిష్కరించగా 583 పెండింగ్‌లో ఉన్నాయి. పాస్‌పుస్తకం లేకుండా వారసత్వ బదిలీకై 242 దరఖాస్తులు రాగా 129 పరిష్కరించగా 113 పెండింగ్‌లో ఉన్నాయి. మ్యూటేషన్‌లకై 201 దరఖాస్తులు రాగా 157 పరిష్కరించగా 44 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులు 145 ఉండగా ఇందులో 58 పరిష్కరించగా 87 పెండింగ్‌లో ఉన్నాయి. పట్టా పాసు పుస్తకం లేకుండా నాలా కన్వర్షన్‌కై 113 దరఖాస్తులు రాగా 48 పరిష్కరించగా 65 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులకు పట్టాపుస్తకాల జారీకై 40 దరఖాస్తులు రాగా 23 పరిష్కరించగా 17 పెండింగ్‌లో ఉన్నాయి. నాలా మార్పిడికి 27 దరఖాస్తులు రాగా 20 పరిష్కరించగా 7 పెండింగ్‌లో ఉన్నాయి. అమలు చేసిన జీపీఏకు 15 దరఖాస్తులు రాగా 4 పరిష్కరించగా 11 పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వ ప్రత్యేక చొరవతో..

ధరణి దరఖాస్తులు సుమారు 3 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉంటున్నాయి. పరిష్కరించే అధి కారం తహసీల్దార్, ఆర్డీవోలకు లేక భారమంతా కలెక్టర్‌లు, సీసీఎల్‌ఏ పైనే పడింది. దీంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం చొరవ చూపించడంతో గ్రివెన్స్ ల్యాండ్ మ్యాటర్, వారసత్వ బదిలీలు, భూసేకరణ సమస్యలు, ఖాతాల విలీనం, పెండింగ్ మ్యూటేషన్‌లు, కోర్టు కేసులు, పాస్ పుస్తకాలు లేకుండా నాలా కన్వర్షన్ వంటికి కొన్నింటిని అధికారులు పరిష్కరించారు. జిల్లాలో అత్యధికంగా గ్రివెన్స్ ల్యాండ్ మ్యాటర్‌లకు సంబంధించినవే ఎక్కువగా పరిష్కరించారు.

పెండింగ్‌లో టీఎం 33 మ్యాడ్యుల్ సమస్యలు

ధరణిలో టీఎం 33 మ్యాడ్యుల్ పరిధిలో వాటికే ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా తమ భూమి ప్రోహిబీటెడ్ ల్యాండ్ జాబితాలో చేర్చారని అందులోంచి తొలగించాలని కోరుతూ రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు రావడం లేదని భూమి తక్కువ విస్తీర్ణంలో పాస్‌బుక్కులో నమోదైందని, పేర్లు తక్కువగా పడ్డాయని, మ్యూటేషన్ కోసం ఇలా రకరకాల భూ సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీటి కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ రైతులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

భూ సమస్యలపైనే ప్రజావాణిలో ఫిర్యాదులు

భూ రికార్డుల డిజిట లైజేషన్ కోసం గత ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా ధరణి పోర్టల్‌ను అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ధరణితో జిల్లాలో వేలాది మంది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. తమ భూ సమస్యల పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ వచ్చారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ధరణికి సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయి. ప్రతీ వారం నిరుపేద రైతులు వందల సంఖ్యలో కలెక్టరేట్ వద్ద పడిగాపులు కాస్తుండడం పరిపాటిగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కాకపోవడంతో ద హా ర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ధరణి దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టింది.

17 వరకు కొనసాగనున్న స్పెషల్ డ్రైవ్

దరఖాస్తులను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ఈనెల 1 నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్ నిర్వహణకు గడువు ఇటీవలే ముగిసినప్పటికీ ఇంకా పరిష్కరించాల్సిన దరఖాస్తులు వేలల్లో ఉండడంతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ఈనెల 17 వరకు పొడిగించారు. భూ సమస్యల పరిష్కారం నిరంతర ప్రక్రియ అయినప్పటికీ ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా ఈ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. ఇతర కార్యక్రమాల కంటే ఈ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు.

గొడవలు వద్దు.. రాజీ మార్గమే ముద్దు!

- నేడు జాతీయ లోక్‌అదాలత్
- దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి అవకాశం
- సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందంటున్న న్యాయమూర్తులు
- జిల్లాలో 6 బెంచీల ఏర్పాటు

కామారెడ్డి టౌన్, మార్చి 15: చిన్నచిన్న తగదాలతో మనస్పర్థలు ఏర్పరుచుకుని పోలీసుస్టేషన్, కోర్టు మెట్లు ఎక్కుతూ దీర్ఘకాలికంగా మానసికంగా ఎంతో మంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు ఆధిపత్యం పొందేందుకు కేసులు నమోదు చేసుకుంటూ కక్షలను పెంచుకుంటున్నారు. ఆ కేసులు ఏళ్ల కొద్ది పరిష్కారం కాకుండా కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి చిన్నచిన్న కేసుల సత్వర పరిష్కారం లక్ష్యంగా న్యాయస్థానాలు సువర్ణావకాశం కల్పిస్తున్నాయి. రాజీమార్గమే రాజమార్గమంటూ వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితాంతం కొనసాగుతాయని, ఒక వేల ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే సమసిపోతాయంటూ లోక్‌అదాలత్ వేదికగా కేసులను పరిష్కరించనున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ కోర్టులలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారు.

లోక్‌అదాలత్ అంటే..

వివాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి ఏర్పడిన ఉప న్యాయ వేదికనే లోక్‌అదాలత్. కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. సిట్టింగ్ లేదా పదవీ విరమణ పొందిన న్యాయమూర్తి ఛైర్మన్‌గా, ఒక న్యాయవాది సభ్యులుగా లోక్‌అదాలత్ సాగుతుంది. ఇక్కడ రెగ్యులర్ కోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాటితో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను సైతం పరిష్కరిస్తారు. ఇరువర్గాలు ఓ అవగాహనకు వచ్చి రాజీ కుదిరితే అక్కడికక్కడే కేసు పరిష్కారమవుతుంది. ఇది పూర్తిగా చట్టబద్ధత కలిగిన అంతిమ తీర్పు కావడంతో మళ్లీ అప్పీల్ చేసుకునే వీలు లేదు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత సేవలు అందుతాయి.

న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షణ

ఈ మేరకు న్యాయ సేవాధికార సంస్థ రంగంలోకి దిగి పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తారు. లోక్‌అదాలత్ మొత్తాన్ని న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షిస్తోంది. కాగా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలు విజయం సాధించినట్లే అందుకే చాలా కాలం నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడమే ఉత్తమమని న్యాయమూర్తులు సూచిస్తున్నారు. కాగా ఆయా కోర్టుల్లో లోక్‌అదాలత్ కార్యక్రమానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆరు బెంచీల ఏర్పాటు

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా కేసుల పరిష్కారానికి జిల్లాలో మొత్తం 6 బెంచీలు ఏర్పాటు చేశారు. ఇందులో కామారెడ్డిలో 4, ఎల్లారెడ్డి 1, బాన్సువాడ 1 బెంచీలు ఏర్పాటు చేసి కేసుల పరిష్కారం చేయనున్నారు. ఈ లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్ కేసులు, తగదా పడ్డ కేసులు, చీటింగ్ కేసులకు సంబంధించిన, వివాహబంధానికి సంబంధించిన, చిన్నచిన్న దొంగతనాలు, చెక్‌బౌన్స్ తదితర కేసులను పరిష్కరించనున్నారు. దీర్ఘకాలికంగా కేసులతో సతమతం అవుతున్న వారికి ఈ కార్యక్రమం మంచి వేదికగా ఉపయోగపడుతుందని పోలీసులు, న్యాయవాదులు పేర్కొంటున్నారు.


లింగంపేటలోని మెట్ల బావి

పురాతన కట్టడాలు.. వారసత్వానికి చిహ్నాలు!

- జిల్లాలో పురాతన కట్టడాల అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయ కోనేరు అభివృద్ధి
- లింగంపేటలో కొనసాగుతున్న నాగన్నగారి బావి పనులు
- ఎల్లారెడ్డిలో పురాతన బావి, రాజంపేటలో మెట్ల బావి అభివృద్ధికి ఏర్పాట్లు

భిక్కనూరు, మార్చి 15: శతబ్దాల చరిత్ర కలిగిన మెట్లబావులు మన సంస్కృతిలో భాగం. జిల్లాలో గతంలో ఎంతగానో ప్రాచుర్యం పొందిన ఈ మెట్ల బావులు గత కొంతకాలంగా ఆదరణకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. చారిత్రక వైభవానికి సజీవ సాక్షాలుగా నిలిచే మెట్లబావుల పునరుద్ధరణకు, పరిరక్షణకు ప్రణాళిక బద్ధంగా కార్యాచరణలను చేపట్టి భూగర్భజలాల పెంపుతో పాటుగా ఈ పురాతన మెట్లబావుల చరిత్రను భావి తరాలకు అందించాలన్న మంచి ఉద్దేశ్యంతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముందుకు సాగుతున్నారు. దాతల సహాయంతో, స్వచ్ఛంధ సంస్థల సహాయంతో జిల్లాలోని ఈ పురాతన కట్టడాలను పురుద్ధరించే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో ఎంతో మహిమ కలిగిన, ప్రసిద్ధి చెందిన సిద్ధరామేశ్వర ఆలయ ప్రాంగణంలోని రాతి కట్టడంతో నిర్మించిన కోనేరును, లింగంపేట మండలంలో గల నాగన్నగారి బావి, ఎల్లారెడ్డి పట్టణంలోని పురాతన బావి, రాజంపేట మండల కేంద్రంలోని పురాతన మెట్లబావి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. భిక్కనూరులోని కోనేరును దాతలు, స్వచ్ఛంధ సంస్థల సహాయంతో పునరుద్ధరించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. లింగంపేటలోని నాగన్నబావి పునరుద్ధరణ పనులు కొనసాగుతుండగా, ఎల్లారెడ్డి, రాజంపేటలోని పురాతన మెట్లబావులను గుర్తించి వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే సిద్ధరామేశ్వర ఆలయ కోనేరు అభివృద్ధి

భిక్కనూరు మండల కేంద్రంలోని దక్షిణకాశీగా ఎంతగానో ప్రసిద్ధి చెందిన ఎన్నో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పార్వతీ సిద్ధరామేశ్వర ఆలయ ప్రాంగణంలో పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించిన కోనేరు ఉంది. గతంలో ఈ కోనేరు నుంచి దోమకొండ కోటకు సొరంగ మార్గం ఉండేదని చరిత్ర చెబుతోంది. పూర్వకాలంలో ఎంతగానో ఆదరణ పొందిన ఈ కోనేరు (మెట్లబావి)కు, ఈ సొరంగ మార్గానికి రానురానూ ఆదరణను కోల్పోయి ఈ కోనేరులోని రాతి కట్టడాలు దెబ్బతినడంతో పాటుగా పడిపోవడం జరిగింది. ఇందులోని సొరంగమార్గం సైతం పూర్తిగా దెబ్బతిన్నదని పూర్వికులు చెబుతారు. దీనిని గమనించిన కలెక్టర్ ఈ కోనేరును పునరుద్ధరించాలని హైదరాబాద్‌లోని ది రేయిన్ వాటర్ ప్రాజెక్టు స్వచ్ఛంధ సంస్థ, దాతలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ, ఇంజనీర్‌ల సహాయంతో కొన్ని నెలల పాటు కష్టపడి ఆలయంలో ప్రాంగణంలోని రాతి కట్టడాలను ఉపయోగించి అందంగా తీర్చిదిద్ది ప్రజలకు ఇటీవలే అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోనేరు పునఃప్రారంభం కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత జనవరి 14న పెద్దపండుగలా నిర్వహించారు.

లింగంపేట నాగన్నబావి వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులు

ఇటీవల హైదరాబాద్‌లో బన్సీలాల్‌పేటలో వందల సంవ్సరాల క్రితం నాటి మెట్ల బావి వెలుగు చూసిన విషయం తెలిసిందే. అలాంటి కట్టడమే లింగంపేటలోని కామారెడ్డి - ఎల్లారెడ్డి రహదారి పక్కన పోలీసుస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఈ నాగన్నగారి బావి. లింగంపేట మండల కేంద్రంలోని నాగన్నబావికి ఎంతగానో చరిత్ర ఉంది. 18వ శతాబ్దంలో ఈ మెట్లబావిని జక్సాని నాగన్న అనే వ్యక్తి నిర్మించాడని, అందుకే ఈ బావిని నాగన్నగారి బావి అని పిలుస్తారని, ఈ బావి ప్రజల దాహార్తిని తీర్చేందుకు, పంటలు సాగు చేసుకునేం దుకు ఉపయోగించినట్లు పూర్వికులు చెబుతారు. ఈ మెట్లబావి నిర్మాణంలో కళా నైపుణ్యం ఎంతగానో అబ్బుర పరుస్తోంది. ఉపరితలం నుంచి 20 అడుగులకు ఒక అంతస్తు చొప్పున ఈ బావిలో ఐదు అంతస్థులు ఉన్నాయి. ఈ మెట్లబావికి నలువైపులా మెట్లు ఉన్నాయి. ప్రధాన మార్గాన్ని మాత్రం పడమర దిశకు ఏర్పాటు చేశారు. ఈ బావిలో శంఖుచక్రాలు, పుష్పాలు ఇలా రకరకాల శిల్పాలు చెక్కారు. ఈ బావి తూర్పు భాగంలో బావి నుంచి పైకి నీరు చేదడానికి మోట్లబావి లాంటి నిర్మాణం ఉంటుంది. ఇక్కడి నుంచే పంటలకు కాలువల ద్వారా నీటిని తరలించేవారని పూర్వికులు చెబుతారు. కానీ రానురాను ఈ బావి నిర్లక్ష్యానికి గురై శిథిలాస్థకు చేరుకుంది. ఈ బావిలో చెట్లు మొలకెత్తి, రాళ్లు పైకి లేచి కళావిహీనంగా తయారైంది. దీనిని కలెక్టర్ గుర్తించి ఈ బావిలో పూడికతీత పనులను స్వచ్ఛంధ సంస్థలు, దాతలు, కలెక్టర్ నిధుల నుంచి చేపడుతున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

ఎల్లారెడ్డిలో రామాలయ బావి, వేణుగోపాల స్వామి మరమ్మతులకు శ్రీకారం

ఎల్లారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ వెళ్లేరోడ్డులో ఉన్న రామాలయంలో ఉన్న పురాతన బావి, ఈ ఆలయానికి ఎదురుగా ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో ఉన్న మరో పురాతన బావిని పునరుద్ధించేందుకు కలెక్టర్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ఈ రెండు బావులను ఇటీవలే సందర్శించారు. ఈ సందర్భంగా ఈ బావులలో అధికారులు శ్రమదానం కార్యక్రమం నిర్వహించగా యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. దాదాపు 380 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పురాతన మెట్ల బావులను పునరుద్ధరించడంతో భూగర్భ జలాల పెంపుతో పాటుగా ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు.

రాజంపేట మెట్ల బావికి మహర్దశ

తెలంగాణలో ఎదురులేకుండా పాలించిన సంస్థానాల్లో మెదక్‌లోని పాపన్నపేట సంస్థానం ముందువరుసలో ఉంటుంది. ఈ సంస్థాన రాజులు మెదక్‌తో పాటుగా ఎల్లారెడ్డి తాలుకాలోని కొంత భాగాన్ని సైతం పాలించారు. ఈ రాజంపేట గ్రామాన్ని సుమారు 600ల సంవత్సరాల క్రితమే పాపన్నపేట సంస్థానదీశులు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. మొదటగా ఈ గ్రామాన్ని సీతారాములపల్లిగా పిలిచేవారు. తర్వాత ఈ గ్రామాన్ని వీరి సంస్థానంలో ఒకరైనా రాజమ్మ దాదాపుగా 50ఏళ్లుగా పాలించగా ఆమె పేరు మీదుగానే ఈ గ్రామం పేరు రాజంపేటగా మారింది. రాజమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో వ్యవసాయ భూములకు నీరు అందేలా తొమ్మిది చెరువులు, తాగు నీటి కోసం బావులను సైతం నిర్మించారని, ఈ బావులను పూర్తిగా రాతితో నిర్మించారని, ఈ మెట్లబావి గుండా గోల్కొండ, పాపన్నపేట సంస్థానానికి, దోమకొండకు రహస్య మార్గాలు(సొరంగాలు) ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం పిట్టలగైని వద్ద ఉన్న మెట్ల బావి పూర్తిగా చెత్త చెదారంతో, పిచ్చిచెట్లు మొలకెత్తి అధ్వానంగా మారింది. ఈ పురాతన బావిని పునరుద్ధరించి భావితరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ మొట్లబావికి మహర్దశను తీసుకురావడానికి స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, దాతల సహాయంతో కలెక్టర్ ముందుకు సాగుతున్నారు.

అవసరం మేరకే సాంకేతికతను వినియోగించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 15: సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడం, కృత్రిమ మేధస్సు వల్ల స్వతహాగా ఆలోచించే విధానం సన్నగిల్లుతుందని, మోసాలు ఎక్కువగా జరిగే అవకాశముందని అవసరం ఉన్నంత మేరకే సాంకేతికతను వినియోగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో గ్యాబ్లింగ్ వంటి వివిధ యాప్‌ల ద్వారా కుటుంబాలు నాశనమవుతూ, ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయని, యువత అప్రమత్తంగా యాప్‌లను ఉపయోగించాలని తెలిపారు. దైనందిన జీవితంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మాల్టీలెవల్ మార్కెటింగ్, ఈ కామర్స్ తదితర విదానాల ద్వారా వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్న వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం 2019లో వినియోగదారుల రక్షణ చట్టం తెచ్చిందని తెలిపారు. ప్రధానంగా తూనికలు, కొలతలతో మోసాలు, కల్తీ, నాణ్యతలేని వస్తువులు, విక్రయించడం బ్లాక్ మార్కెటింగ్ చేసి అధిక ధరలకు విక్రయించడం వల్ల మోసపోతున్నారని తెలిపారు. ఈ చట్టం ద్వారా నష్టపోతే పరిహారం పొందే హక్కుతో పాటు వస్తువు ఎంపిక చేసుకునే హక్కు, భద్రత, సమాచారం, విద్య, ఆరోగ్య హక్కులు పొందవచ్చని తెలిపారు. వినియోగదారుడు వస్తువు కొనేముందు నాణ్యత, ఎక్స్‌పైర్ తేదీ, గరిష్ఠ ధర వంటివి పరిశీలించి రసీదు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ సునీత, ఉద్యానవన అధికారి విజయ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, పరిశ్రమల కేంద్ర సహాయ సంచాలకులు రఘునందన్, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు లక్కీడ్రా

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ప్రవేశాలకు సంబంధించి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ లక్కీడ్రాను నిర్వహించారు. లక్కీడ్రాలో సుంకరి బృందన, త్రిక్షణ అనే చిన్నారులు ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సహర్
సా.6.32	ఉ.5.01

అపనిందలు మోపి, ఇతరులపై చాడీలు చెప్పే ప్రతీ ఒక్కడికి వినాశనం తప్పదు

పసుపుబోర్డు ఎగుమతితో ధరల పెరుగుదల : కిసాన్ మోర్చా



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జిల్లా ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి

ముప్కాల్, మార్చి15: పసుపుబోర్డు ఏర్పాటు దేశంలో పసుపు ఎగుమతులు పెరగడంతో ఆశించిన స్థాయిలో పసుపు ధరలు పెరుగుతున్నాయని కిసాన్ మోర్చా జిల్లా ప్రెసిడెంట్ పొద్దుటూరి తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ చొరవతో జిల్లాకు పసుపుబోర్డు ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. దేశంలో దిగుమతి తగ్గడం, ఎగుమతులు గణనీయంగా పెరగడం, పసుపు ధర పెరుగుదలకు కారణమని, దిగుబడి పంట విస్తీర్ణం తగ్గిందని పసుపు రేటు పెరుగుతుందని అవగాహన లేని కొందరు మాట్లాడడం హాస్యాస్పదమని ఆయన మండిపడ్డారు. దేశంలో ఏడు లక్షల 72వేల ఎకరాలు విస్తీర్ణంలో పసుపు పండిస్తే మహరాష్ట్ర, ఇంగోలి, నాందేడ్, బసుమతి ప్రాంతాల్లో పెరిగిందని వెల్లడించారు. పసుపు బోర్డు జిల్లాకు రాలేదని బోర్డు కారణం కాదని అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అంతేకాకుండా పసుపుబోర్డు ఏర్పాటుపై కేంద్ర కేబినెట్‌లో గెజిట్ విడుదల అయ్యిందని, బోర్డుకు చట్టబద్ధత కల్పిస్తూ జీవో వచ్చిందని పేర్కొన్నారు. అందుకు ఎంపీ అర్వింద్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక చొరవ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రెసిడెంట్ అంబటి నవీన్, కిసానమోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట చిన్నయ్య, మండల ప్రధానకార్యదర్శి మీసాల చందు, గంగాధర్, అచ్చారం, వినోద్, పెండెం నర్సయ్య, కార్తిక్, కన్నారెడ్డి, ఐరా ప్రవీన్, సాయికిరణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి విద్యుత్ శాఖ ఏడీఈ సస్పెన్షన్, ఏఈ బదిలీ

సుభాష్‌నగర్, మార్చి15: ఎడపల్లి ఏడీఈ, ఏఈల మధ్య గొడవ సస్పెన్షన్‌కు దారితీసింది. ఏడీఈ తనపై దాడిచేశాడంటు ఏఈ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఏడీఈ లక్ష్మణ్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈ ప్రసాద్ ను నిర్మల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. గత కొన్ని రోజుల క్రితం ఎడపల్లి ఏడీఈ కార్యాలయంలో వీరిద్దరు గొడవ పడ్డారు. ఈ ఘటనను సీరియస్‌గా ఉన్నతాధికారులు ఈ మేరకు విచారణ చేపట్టి ఒకరిని సస్పెండ్ మరొకరిని బదిలీ చేశారు.

చకచకా ధర్మోరా ఎత్తిపోతల పనులు!



● ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే రెండు గ్రామాలకు లబ్ధి
● సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు ● రూ.11కోట్ల 70లక్షలతో నిర్మాణం పనులు

మాక్లూర్, మార్చి 15: గత కొన్నేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు చకచకా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మండలంలోని ముల్లంగి, బొంకన్‌పల్లి, మాదాపూర్ గ్రామాల రైతులకు లబ్ధి చేకూరనుంది. దీంతో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందనుంది. మే చివరి నాటికి పనులు పూర్తిచేస్తామని ఇరిగేషన్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాలు నిజాంసాగర్‌సాగర్ చివరి ఆయకట్టు కావడంతో పంట భూములు సాగుకు నోచుకోక రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా అదనపు పైప్‌లైన్ వేయాలని అధికారులు, పాలకులతో మొరపెట్టుకున్న ఫలితం దక్కలేదు. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని గత ప్రభుత్వ హయంలో కేసీఆర్ సహకారంతో రూ.11కోట్ల 70కోట్ల నిధులు మంజూరు చేయించారు. రాజకీయ వైరాల కారణంగా పనులు నత్తనడకన సాగాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి చెందడంతో రైతుల ఒత్తిడితో పనులు చకచకా సాగుతున్నాయి. పంప్‌హౌజ్ పనులు 90 శాతం పూర్తి కాగా పైప్‌లైన్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే బొంకన్‌పల్లి గ్రామంలోని 708 ఎకరాలు, ముల్లంగిలో 190 ఎకరాలు, మాదాపూ ర్‌లో 110 ఎకరాలకు సాగునీరు అందనుంది. మొ త్తానికి ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కావస్తుండడంపై గ్రామాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మే చివరి నాటికి పనులు పూర్తి చేస్తాం

● రవికుమార్, ఇరిగేషన్ డీఈఈ

ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు యుద్ధ ప్రతిపాదికన జరుగుతున్నాయన్నాయి. మే చివరి నాటికి పనులను పనులను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తాం.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బిగాల గణేష్ గుప్తా

ఆటోడ్రైవర్ స్వామి కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి: మాజీ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, మార్చి15: ఆటోడ్రైవర్ స్వామి కుటుంబానికి 15లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఆటోడ్రైవర్‌లకు ప్రతీనెల 10వేల నుంచి 15 వేలు వేతనం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా కెనాల్ కట్ట ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ స్వామి ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్ దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుమారుడు అనాథగా మిగిలాడన్నారు. రాష్ట్రంలో రోజుకోచోట ఆటోడ్రైవర్ ఆత్మహత్యలు చేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆటోడ్రైవర్ దంపతులు కుటుంబ పోషణ బారమై ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. స్వామి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ నగర అధ్యక్షులు సిర్ప రాజు, కార్యదర్శి ఎనుగందుల మురళి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సూదం రవిచందర్, సుజిత్‌సింగ్, తదితరులు ఉన్నారు.

కృష్ణ మందిరంలో విగ్రహాల ఊరేగింపు

● ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించిన భక్తులు

డిచ్‌పల్లి, మార్చి 15: మండలంలోని మిట్టపల్లిలో గ్రామస్థులు నిర్మించిన శ్రీకృష్ణ మందిర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను గ్రామప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన డా.ఈగ నర్సయ్య కుటుంబ సభ్యులు రూ.10వేల విరాళం ఆలయ అభివృద్ధికి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నర్సయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

మోర్తాడ్, మార్చి15: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ అన్న అజారుద్దీన్ శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతేగాక ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సంతోష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు తిమ్మాపూర్‌కు చెందిన డాక్టర్ ఎండి.కబీర్, మరికొందరు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజాపాలనలో బాగస్వామ్యం కావాలని, ప్రజలు కోరుకున్న పాలన కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని అన్నారు. పార్టీలో చేరిన వారిని ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మహిపాల్, గురువయ్య, కుంట శ్రీనివాస్, రొక్కం మురళీ, బద్దం రాజశేఖర్, ఎం.సురేష్, జక్కం అశోక్; సాయిరెడ్డి, దీరాజ్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ, బీజేపీ నాయకులు

మోపాల్ సొసైటీ చైర్మన్‌గా గంగారెడ్డి ఏకగ్రీవం

మోపాల్, మార్చి 15: మండలంలోని మోపాల్ సొసైటీ చైర్మన్‌గా గంగారెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.మురళి తెలిపారు. గతంలో సొసైటీ చైర్మన్‌గా ఉన్న ఉమాపతిరావు ఇటీవల చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో చైర్మన్‌ను ఎన్నుకునేందుకు సంబంధిత అధికారులు శుక్రవారం ఉదయం ఎన్నికలను నిర్వహించగా ముల్లంగి గంగారెడ్డి చైర్మన్‌గా నామినేషన్‌ను దాఖలు చేశారు. మరెవరూ చైర్మన్‌గా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. గంగారెడ్డి వెంట 11మంది డైరెక్టర్లు ఉన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గంగారెడ్డి వెంటనే ఉన్నారు. అధికారులు గంగారెడ్డి పేరును ప్రకటించడంతో సొసైటీ ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి సహకారంతోనే చైర్మన్‌గా ఎన్నికైనట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గంగారెడ్డిని నగేష్‌రెడ్డితోపాటు గంగాప్రసాద్, ప్రతాప్, సొసైటీ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్, తిరుపతి సన్మానించారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగ అవకాశం

సుభాష్‌నగర్, మార్చి 15: ఇజ్రాయిల్‌లో నిర్మాణ కార్మికులు షటరింగ్, కార్పెంటర్, సిరామిక్ టైలింగ్‌లో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి సిరిమల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 16న జిల్లా ఉపాధి కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేయడానికి కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి మూడు సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. వేతనం లక్షా 20వేల నుంచి లక్షా 38వేల వరకు ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 31 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో టామ్ కాన్ ఆధ్వర్యంలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మోర్తాడ్‌లో కాన్షిరాం జయంతి

మోర్తాడ్, మార్చి15: మండల కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద బహుజన నాయకుడు కాన్షిరాం 90వ జయంతిని దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కాన్షిరాం చిత్రపటానికి దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లారి రాజారాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజన రాజ్యాధికారం కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు కాన్షిరాం అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకుడు బాబురావు, మామిడి గంగాధర్, రాజు, సందీప్, సృజన్, భూమన్న, మామిడి లింగయ్య, రాజు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో ఓటరు ప్రతిజ్ఞ, మానవహారం

ఆర్మూర్‌రూరల్, మార్చి15: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు ప్రతిజ్ఞ మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలను పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారం నిర్వహించి నిష్పక్షపాతంగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రవికుమార్, అనంత్‌రావు, లక్ష్మణ్, డాక్టర్ పోశన్న, జ్యోతి, సుజాత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, మార్చి15: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లక్కం ప్రభాకర్ ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న గేదెజాతి, గోజాతి పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. మామిడిపల్లిలో 650 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వీడీసీసభ్యులు చిన్న రాజన్న, లక్కరం నరేష్, ప్రవీణ్, శ్రావణ్, పశువైద్య సిబ్బంది, రాజేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, నాగార్జున, దివ్య, రాధ, గోపాల మిత్రలు రాజన్న, సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన డీపీవో



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో తరుణ్

రెంజల్, మార్చి 15: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీల అమలు ప్రక్రియ నిమిత్తం ప్రతీ గ్రామంలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలోని సవరణలను మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. పథకాల ద్వారా ప్రతీపేదవాడికి లబ్ధి చేకూరేందుకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తుల కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్ సవరణలను చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం నీలాలో తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో తాగు నీరు సౌకర్యాల గురించి హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కలిగోట గంగాధర్



నియామపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఆర్మూర్‌టౌన్, మార్చి15: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఆర్మూర్‌కు చెందిన కలిగోట గంగాధర్‌ను నియామించినట్టు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలిగోట గంగాధర్ మాట్లాడుతూ తన నియామకానికి తోడ్పడిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పార్లమెంటరీ ప్రభరి వెంకటరమణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. ఆయనను పలువురు పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌లో చేరిన బడాభీమ్‌గల్ ఎంపీటీసీ

భీమ్‌గల్ రూరల్, మార్చి15: భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన బడాభీమ్‌గల్ గ్రామ ఎంపిటిసి 2 కేతావత్ వల్లీ సంత్యాలి శుక్రవారం మోర్తాడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో పనిచేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

మోస్రా, మార్చి15: మండలంలోని తిమ్మాపూర్ చే సెంబర్ తండా గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. బాన్సువాడ మాజీ జడ్పీటీసీ కొత్తకొండ భాస్కర్, మోస్రా పార్టీ మండల అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ అధ్యక్షతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా గజ్జి నారాయణ, ఉపాధ్యక్షుడిగా శేఖర్, మస్కూరి శ్రీనివాస్, కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా పెద్దిగారి రాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, మండలయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, మోస్రాగ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ

రెంజల్, మార్చి 15: మండలంలోని నీలా గ్రామానికి చెందిన ముఖీమ్ గత కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగలించబడిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని శుక్రవారం బాధితుడు ముఖీమ్‌కు ఏఎస్ఐ రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ఉన్నారు.

చేయూత పథకం ఉపకరణాల పరిశీలన

కోటగిరి, మార్చి15: చేయూత పథకం కింద లబ్ధిదారులకు అందించిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. కోటగిరి మండలంలోని రాంపూర్, సుద్దులంలో బీసీ కార్పొరేషన్ కింద అందించిన చేయూత ఉపకరణాలను ఏ మేరకు ఉపయోగించుకుంటున్నారని పరిశీలించారు.

మోర్తాడ్‌లో డ్రైనేజీ పనులకు భూమిపూజ



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మోర్తాడ్, మార్చి15: మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులను శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. తొలుత భూమిపూజ చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, మహిపాల్, గురువయ్య, నాగభూషణం, శ్రీధర్, మోహన్, రాజేందర్, రాకేష్‌గౌడ్, నవీద్, లక్ష్మణ్, జైడి చిన్న గంగారాం, పెద్ద గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుట్టతండాలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కోటగిరి, మార్చి 15: కోటగిరి మండలంలోని దేవుని గుట్ట తండా గ్రామంలో శుక్రవారం సిమెంటు రోడ్డు పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రత్యేకంగా ఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో రూ.5లక్షల మంజూరు చేయించారన్నారు. సీసీ రోడ్డు పనులలో నాణ్యత ప్రామాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, జైపాల్, కిషన్, యశ్వంత్, రవి, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

నవపేట, మార్చి 15: గత ఆరు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత ఆరు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

'కవిత అరెస్టు హేయమైన చర్య'

ధర్పల్లి, మార్చి 15: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం హేయమైన చర్య అని ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అభివర్ణించారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆమె స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఈడీ చేత కేంద్ర ప్రభుత్వం దిగజారుడు చర్యలకు పూనుకుంటుందని ఆరోపించారు. కవితను వెంటనే బేషరత్తుగా విడుదల చేయాలని లేనిపక్షంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఉద్యమిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజ్‌పాల్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, పోతరాజు, సురేష్, నర్సయ్య పాల్గొన్నారు.

'నాలుగు నెలల వేతనాలు చెల్లించాలి'



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వర్ని, మార్చి 15: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్ల 4 నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని శుక్రవారం తెలంగాణ హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్దతుల్లో పని చేసే కార్మికుల నాలుగు నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీస వేతనం రూ26వేల వేతనం చెల్లించి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్ని ఏరియా అధ్యక్షురాలు సుశీల, ప్రధాన కార్యదర్శి సావిత్రి, కోశాధికారి బాల ప్రసాద్, ఉపాధ్యక్షురాలు కొండబాయి, సహాయ కార్యదర్శి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

బినోల సొసైటీ మహజన సభ

నవీపేట, మార్చి 15: మండలంలోని బినోల సొసైటీ మహజన సభను శుక్రవారం సొసైటీలో నిర్వహించారు. ఏప్రిల్ 2023నుండి సెప్టెంబర్ 2023వరకు సంఘం నిర్వహించిన ఆర్థిక లావాదేవీలను కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా నాడాపూర్, తుంగిని, సిరన్‌పల్లి, గాంధీనగర్‌లలో నూతనంగా గోదాములను నిర్మించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, పలువురు డైరెక్టర్లు, కార్యదర్శి, సంఘం సభ్యులు ఉన్నారు.



మహజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ హన్మాండ్లు

వన్యప్రాణుల సంరక్షణ, అవగాహనపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అధికారి

డొంకేశ్వర్, మార్చి15: డొంకేశ్వర్ మండలంలోని నడ్కుడ, గాదేపల్లి శివారులో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో 120మంది జిల్లా అటవీ అధికారులకు వన్యప్రాణుల సంరక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్టు డివిజన్ ఆఫీసర్ భవాని శంకర్ హాజరయ్యారు. వన్యప్రాణుల యొక్క ఆవశ్యకతను వాటి సంరక్షణ విధానాన్ని క్షేత్రస్థాయిలో సిబ్బందికి వివరించారు. ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ జీవాలపైన ఫారెస్ట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ పెరిగే క్రమంలో ఇక్కడ ఉన్న జంతువులకు సరైన స్థలం దొరకాక పొలాలో ఉండే విద్యుత్ వైర్లకు తగిలి మృత్యువాతపడుతున్నాయన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఉపాధి దొరకడంతోపాటు వన్యప్రాణులకు రక్షణ కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, పద్మరావు, రవిమోహన్, రవీందర్, వినయ్ నాయక్, డిప్యూటీ రెంజ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు!

● రామాలయానికి చెందిన 45 ఎకరాల ఆలయ భూముల్లో ఇతరుల సాగు ● పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు

డిచ్‌పల్లి, మార్చి 15: ఆ ఆలయ 187 ఏళ్ల క్రితం నిర్మించినది. అప్పట్లో ఒక వెలుగు వెలిగిన ఆలయం నేడు కళాహీనంగా మారింది. ఇందల్వాయి రామాలయానికి చెందిన భూములు డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, గ్రామాల శివారులో సుమారు 45 ఎకరాలకు పైగా ఉన్నాయి. కానీ దేవాలయ శాఖ ఈ భూములపై శ్రద్ధ చూపని కారణంగా దేవుని మాన్యం కబ్జా కోరల్లో చిక్కింది. ఆలయం శిథిలావస్థకు చేరినా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ఆలయం కూలిపోయే దశకు చేరుకుంది ఇప్పటికే కల్యాణ వేదిక, సత్రాలు, యజశాల, మండపాలు, కూలీ పోయే దశకు చేరుకున్నాయి. గత 2ఏళ్ల క్రితం నాటి రాష్ట్ర దేవాలయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గ్రామస్థుల కోరికా మేరకు ఆలయం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ఇంత వరకు హామీ నేరవేర్చలేదు. ప్రభుత్వం సైతం మారిపోవడం ఆ విషయం కాస్తా మూలన పడింది. గ్రామస్థులు, భక్తులు, అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను తమ పేర పట్టాలు చేసుకునేందుకు కబ్జా రాయుళ్లు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భూ ములపై కోర్టులో న్యాయ పరిష్కారం కోసం దేవాలయ శాఖ అధికారులు కేసులు వేశారు.

● తిరిగి భూములను స్వాధీనం చేసుకుంటాం: ప్రభాకర్, తహసీల్దార్

రామాలయానికి చెందిన భూముల్లో కొందరు వ్యక్తులు సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి చెందిన భూములు కబ్జాలో ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోనుంది. ప్రభుత్వ భూములను ఎవరూ కబ్జా చేసిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.



సుద్దులం, కోరట్‌పల్లి శివారులోని ఆలయ భూముల్లో సాగు అవుతున్న వరి

రైతులు గాలికుంటు వ్యాధి టీకాలను పశువులకు వేయించాలి

భిక్కనూరు, మార్చి 15: ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని పశువైద్యాధికారి డాక్టర్ దేవేందర్ తెలిపారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని గుర్జకుంట గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నేటి నుంచి నెల రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. పాడి రైతులు తప్పకుండా పశువులకు ఈ టీకాలను వేయించాలన్నారు. గ్రామంలో మొదటి రోజు 59 పశువులకు ఈ టీకాలను వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రేణుకా, పశువైద్య సిబ్బంది అహల్య, ప్రదీప్, సురేష్, బాబా, మహేష్, రైతులు పాల్గొన్నారు.

మద్నూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని మేనూర్ పశు వైద్యుడు విజయ్ కోరారు. నేటి నుంచి ఈ నెల 30 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నామన్నారు. ప్రతీ గ్రామంలో శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలన్నారు.

తాడ్వాయి: రైతులు గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి సింహారావు తెలిపారు. తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో ఆయన శుక్రవారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రతీ రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలని సూచించారు. నెల వరకు గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు అందించడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా పశువులను కాపాడడం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు సంజయ్, పాల కేంద్రం అధ్యక్షుడు కిష్టారెడ్డి, తాడ్వాయి పశువైద్యాధికారి రాంచందర్, సిబ్బంది పోచయ్య, కొండల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పాడి రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని ఎల్లారెడ్డి మండల పశువైద్యాధికారి అర్చనా రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల గ్రామంలో 113 గేదెలకు, 13 ఆవులకు, గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్థులు గోపాలమిత్రలు మహబూబ్, సాయిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గుర్జకుంటలో పశువులకు టీకాలను వేస్తున్న సిబ్బంది

నిధులు విడుదల చేయాలని మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, మార్చి 15: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎల్లారెడ్డి బస్టాండ్, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఉప్పల్‌వాయి, గాంధారి చద్మల్‌రోడ్ నిర్మాణాలు జరుగుతున్నాయని కాంట్రాక్టర్లకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయడానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

పదవ తరగతి పరీక్షా సెంటర్‌ను మార్చాలి

భిక్కనూరు, మార్చి 15: మాందాపూర్‌లోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎత్తివేసి పరీక్షా కేంద్రాన్ని మరొక చోటుకు మార్చాలని భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాధికారి రాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పరీక్షా కేంద్రం నిర్వహిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు అదే పాఠశాలకు చెందిన విద్యార్థుల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని, దీంతో ప్రతిభావంతులైనా వేరే ఇతర పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని పరీక్షా కేంద్రాన్ని మరొక పాఠశాలకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బీర్కూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

బీర్కూర్, మార్చి 15: గత ఏడు నెలలుగా బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని, మెనూ చార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు బీర్కూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు పాల్గొన్నారు.


దోమకొండ జీపీలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

దోమకొండ పంచాయతీలో డీఎల్‌పీవో విచారణ

దోమకొండ, మార్చి 15: మండల కేంద్రంలోని స్థలం విషయంలో గ్రామ పంచాయతీకి వచ్చిన ఫిర్యాదు దరఖాస్తులను శుక్రవారం డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. స్థలంకు సంబంధించిన ఇరువర్గాలతో మాట్లాడారు. ఇరువురికి సంబంధించిన పత్రాలు, డాక్యుమెంట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇద్దరు ఫిర్యాదుదారులు తమ వద్ద ఉన్నటువంటి పూర్తి డాక్యుమెంట్‌లను అందజేయాలని వారికి సూచించారు. రెండు రోజుల్లో విచారణ చేపట్టి డీపీవోకు పూర్తి నివేదికను సమర్పించడం జరుగుతుందని డీఎల్‌పీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్ర పటాలకు క్షీరాభిషేకం

ఎల్లారెడ్డి, మార్చి 15 : లంబాడీలకు సంత్ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎల్లారెడ్డి మండలంలోని వివిధ తండాల గిరిజన నాయకులు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కురుమ సాయిబాబా, సంతోష్, గణేష్, నగేష్, కైలాస్, మైపాల్, సుధాకర్, వసంత్, ప్రకాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక రైతు ఆత్మహత్య

● పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకున్న రైతు
● కామారెడ్డి మండలం లింగాయిపల్లిలో ఘటన

కామారెడ్డి రూరల్, మార్చి 15: కామారెడ్డి మండలంలోని లింగాయిపల్లి గ్రామంలోని కొందరు వ్యక్తుల వేధింపులు తాళలేక గోరేటి రవీందర్‌రెడ్డి(40) అనే రైతు శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెల్ఫీ వీడియో తీస్తూ తన చావుకు గ్రామంలోని ఆరుగురు వ్యక్తులే కారణమంటూ తన పంట పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెల్ఫీ వీడియోను గ్రామంలోని పలు వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. వీడియో ఆధారంగా దేవునిపల్లి పోలీసులు ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థలానికి చేరుకోగా కొన ఊపిరితో ఉన్న రవీందర్‌రెడ్డిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రవీందర్‌రెడ్డి తనకున్న మూడు ఎకరాల పొలంలో వరి పంటను పండిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం సంవత్సరం కిందట ఓ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అయితే గ్రామానికి చెందిన నాగరాజు, మల్లారెడ్డి, వెంకట్ తన ట్రాక్టర్ ఇంజన్‌లో చక్కెర పోసి పని చేయకుండా చేశారని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. ఇదే విషయమై మృతుడు సదరు వ్యక్తులపై దాడి చేయగా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. గ్రామానికి చెందిన మరో ముగ్గురు భూపతి, రవి, ఉదయ్‌లు కేసు కాకుండా కాంప్రమైజ్ చేశారు. మొదటి ట్రాక్టర్ పాడవ్వడంతో రెండవ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. ఆ ట్రాక్టరును సైతం నడపనీయకుండా అడ్డుకుంటూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదనకు గురయ్యాడు. మనస్థాపానికి గురైన రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి తన చావుకు నాగరాజు, మల్లారెడ్డి, వెంకట్, భూపతి, రవి, ఉదయ్‌లే కారణమని వారి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొంటూ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

రోడ్డు విస్తరణకు రూ.25కోట్లు మంజూరు

భిక్కనూరు, మార్చి 15: మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి నుంచి రాజంపేట మండల కేంద్రం వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రూ.25 కోట్లు మంజూరైనట్లు ఎంపీపీ గాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలకేంద్రం నుంచి మండలంలోని రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, రాజంపేట మండలంలోని ఆరేపలితాండా, ఆరేపల్లి, తలమడ్ల, శివాయిపల్లి మీదుగా రాజంపేట మండల కేంద్రం వరకు ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డును విస్తరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, నాయకులు బల్యాల సుదర్శన్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

బాన్సువాడ టౌన్, మార్చి 15: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం 90వ జయంతి నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఇంచార్జి సంతోష్ మాట్లాడుతూ.. నిమ్న వర్గాలను రాజకీయంగా చైతన్యం చేసి రాజకీయ ప్రభంజనం సృష్టించిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాండురంగం, క్యాకయ్య, సాయిరెడ్డి, పర్వయ్య, వసీ, సాయికుమార్ తదితరులున్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన సామాజిక తనిఖీలు

బీర్కూర్, మార్చి 15: 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు సంవత్సరం కాలం ఉపాధిహామీ పథకంలో భాగంగా బీర్కూర్ మండలంలో 2కోట్ల 31 లక్షల 31 వేల 926 రూపాయల ఉపాధిహామీ పనులు చేపట్టారు. అయితే పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు గత రెండు రోజుల క్రితం సోషల్ ఆడిట్ బృందం బీర్కూర్‌కు విచ్చేసింది. శుక్రవారం బీర్కూర్‌తో పాటు అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు ప్రారంభించింది. ఒక ఎస్‌ఆర్‌పీ, 8 మంది డీఆర్‌పీలు, 20 మంది వీఎస్‌ఏలు సామాజిక తనిఖీల్లో పాల్గొన్నారు. వారం రోజుల పాటు గ్రామాల్లో వీఎస్‌ఏలు తనిఖీ చేపట్టి గ్రామ సభలు నిర్వహిస్తారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక సదస్సు నిర్వహించనున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మాచారెడ్డి, మార్చి 15: పాల్వంచ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురు గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్ చైర్మన్ గురువేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పట్టుదలతో చదివి పరీక్షలు బాగా రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, శ్రీ ఆర్యభట్ట ప్రిన్సిపల్ హన్మంత్‌రావు, పీజేఆర్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, మంజీర ప్రిన్సిపల్ సత్యనారాయణ, కౌటిల్య ప్రిన్సిపల్ నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర భక్తులకు ఘన స్వాగతం

గాంధారి, మార్చి 15: మండలం గుడిమెట్ గ్రామసమీపంలోని మహాదేవుని గుట్ట నుంచి ప్రారంభమైన పాదయాత్ర మండలంలోని భూంపల్లి గ్రామానికి మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకుంది. అంబరీశ్వర ఆలయ సమీపంలోని చేరుకోగానే మాజీ జడ్పీటీసీ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు మహా పాదయాత్ర భక్తులకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాదేవుని గుట్ట జయదేవ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 22న భువనగిరి జిల్లా కొలానుపాక చేరుకుంటుందని తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా మధుసూదన్‌రావు

గాంధారి, మార్చి 15: మండలంలోని మాదవపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్‌రావు బీజేపీ మండల అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. శుక్రవారం జిల్లా అధ్యక్షురాలు అరుణతార మధుసూదన్‌కు నియామక పత్రాన్ని అందించారు.

జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు షాక్

● ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో భారీగా చేరికలు

నిజాంసాగర్, మార్చి 15: జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన విషయం విదితమే. శుక్రవారం జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారికి ఎంపీ బీబీ పాటిల్, అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు పనులు ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, మార్చి 15: మండలంలోని వడ్లం, చిన్న దేవిసింగ్ తాండ గ్రామాలలో శుక్రవారం సీసీ రహదారి పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. ఒక్కొక్క గ్రామానికి 5 లక్షల రూపాయల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, విఠల్, బాబుసింగ్, సకరాం తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరయ్యాయని, సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

పెద్ద కొడప్‌గల్, మార్చి 15: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గత పదిహేను రోజుల కిందట నిర్వహించిన పరీక్షలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, మెమెంటోలను అందజేసినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు గాను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్షలు నిర్వహించగా చాలా మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు హన్మంత్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు సాగర్, పిర్దోస్, మష్టజి, విలాస్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ సక్రమంగా నిర్వహించాలి

సదాశివనగర్, మార్చి 15: ఓటరు జాబితా సవరణను అతి జాగ్రత్తగా సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ గంగాసాగర్ తెలిపారు. శుక్రవారం సదాశివనగర్ రైతువేదికలో బీఎల్‌ఓల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో చనిపోయిన వారిపేర్లను, రెండుసార్లు పేర్లు ఉన్న ఓటర్లను జాబితాల నుండి తొలగించి ఉన్న ఓటరు లిస్టును క్షుణంగా పరిశీలించి ఓటరు సవరణ జరిగేలా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఇంటింటికి వెళ్లి పూర్తిసమాచారాన్ని సేకరిస్తు ఓటరు జాబితా సవరణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కాజాషరిష్, గిర్ధావర్ సాహిత్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నిక

దోమకొండ, మార్చి 15: బీజేపీ దోమకొండ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి తెలిపారు.ప్రధాన కార్యదర్శులుగా కుంచని జగదీశ్, కాల్వ అంజిరెడ్డి, పట్టణాధ్యక్షుడిగా తిప్పపురం రవి, కిసాన్‌మోర్చ మండలాధ్యక్షుడిగా అనుపాటి నరేందర్‌రెడ్డి, యువమోర్చ మండలాధ్యక్షుడిగా కంది మనోజ్ కుమార్, ఎస్సీ మోర్చ మండలాధ్యక్షుడిగా నత్తి గణేష్, ఎస్టీ మోర్చ మండలాధ్యక్షుడిగా కుర్రి శంకర్, మైనార్టీ మోర్చ మండలాధ్యక్షుడిగా షేక్ జానీ మీయాలను ఎన్నుకున్నట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

సదాశివనగర్, మార్చి 15: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన శెకెల్లి రజినీకాంత్(28) అప్పుల బాధ తాళలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రైని ఐపీఎస్ కాజల్ తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న రజినీకాంత్ ఇటీవల అప్పులు ఎక్కువై బెంగతో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

గాంధారి, మార్చి 15: మండలంలోని రాంపూర్‌గడ్డకి చెందిన రత్లావత్ హరి(40) చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి చనిపోయినట్లు ఎస్‌ఐ అంజనేయులు తెలిపారు. గురువారం రాత్రి ఇంట్లోని దోమతెరను తీసుకుని పెద్ద పోతంగల్‌లోని చెరువులో దిగగా చెరువులో ఉన్న పెద్ద గుంతలలో మునిగిపోయాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి భార్య సాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

లింగంపేట, మార్చి 15: మండలంలోని షట్పల్లి గ్రామానికి చెందిన భూపాల్‌కు కోర్టు ఐదు రోజుల జైలు శిక్షతో పాటు రూ.500 శిక్షను విధించినట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ భూపాల్ పట్టుబడ్డాడని ఆయన తెలిపారు. భూపాల్‌ను ఎల్లారెడ్డి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. భూపాల్‌ను కామారెడ్డి సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఆయన హెచ్చరించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, మార్చి 15: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన షేక్ షౌకత్‌అలీ(35) జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన షేక్ షౌకత్ అలీకి భార్య షబీనా, ఇద్దరు కుమారులు ఉండగా గత మూడు సంవత్సరాల క్రితం షేక్ షౌకత్ అలీ భార్య షబీనా సంసారం విషయంలో భర్తతో గొడవ పడి మూడు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో తన తల్లి గారి ఇంటి వద్ద ఉండటంతో షౌకత్ అలీ తరచూ బాధ పడేవాడని, భార్య కాపురానికి రాదేమోనన్న బెంగతో తాగుడుకు బానిసైనట్లు తెలిపారు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి అన్న షేక్ మసూద్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

● ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి

ఎల్లారెడ్డి, మార్చి 15 : ఎల్లారెడ్డి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో నీటి సమస్య ఉంటుందని, మిషన్ భగీరథ అధికారులు ప్రతీ గ్రామంలో భగీరథ నీరు వచ్చే విధంగా చూడాలని తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అలాగే గృహజ్యోతి పథకం ద్వారా జీరో కరెంట్‌బిల్లు రాని లబ్ధిదారులకు విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ, జడ్పీటీసీ ఉషాగౌడ్, తహసీల్దార్ ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్

పెద్ద కొడప్‌గల్, మార్చి 15: రానున్న రోజుల్లో జుక్కల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పేర్కొన్నారు. శుక్రవారం జుక్కల్ మండలంలోని బస్వాపూర్, పడంపల్లి, బంగారుపల్లి, మైబాపూర్, లొంగన్, కంఠాలి, దోస్‌పల్లి తదితర గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా బస్వాపూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామంలో గల కాంగ్రెస్ నాయకులు శంకర్‌రెడ్డి ఎమ్మెల్యేకు బసవ మందిరం వద్ద బెల్లంతో తులాభారం చేయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ ఎమ్మెల్యేగా తోట లక్ష్మీకాంత్‌రావు విజయం సాధిస్తే బెల్లంతో తులాభారం చేయిస్తానని శంకర్‌రెడ్డి మొక్కుకోగా శుక్రవారం ఆ మొక్కును తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు టీకాలు వేశారు. అనంతరం వివిధ గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను జుక్కల్ నియోజకవర్గానికి కొత్తవాడినైన తనను ఇక్కడి ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. జుక్కల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటానని తెలిపారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి ఎద్దడి తీర్చేందుకు బోరుబావులను తవ్విస్తున్నట్లు తెలిపారు. ఆయా పార్టీల నుంచి మాజీ ప్రజా ప్రతినిధులు, ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి రాగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, నాయకులు రమేష్ దేశాయి, విఠల్ పటేల్, రాజులు సేట్, సంతోషప్ప తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు

● కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, మార్చి 15: బీర్కూర్ శివారు తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ప్రారంభమైన ఈ వేడుకలు మంగళవారం వరకు కొనసాగనున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు దేవనా రామానుజ జీయర్‌స్వామి వారిచే తీర్థ గోష్ఠి, విశ్వక్సేన ఆరాధనం, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ చతుస్థానార్చనం, ధ్వజారోహణం, బలిహరణం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారు భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయన సోదరుడు శంభురెడ్డిలు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాడ వీధుల్లో స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఊరేగించారు. స్వామి వారు పెద్ద శేష వాహనంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, మురళి, రాంబాబు, నరసరాజు, నాగేశ్వర్‌రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


టీటీడీలో పెద్ద శేష వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
దర్శన్	రజాకార్
శాంతి	ప్రేమలు
ప్రియా 70	భీమా
ప్రియా 35	తంత్ర

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	భీమా
వెంకటేశ్వర	రజాకార్

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210